# మళ్ళీ వొస్తావు కదూ!

ఇచ్ఛాపురపు రామచంద్రం

గార్డెన్స్‌లోకి రాగానే అతను చేసే మొట్ట మొదటి పని- ఫౌంటెన్ వెనక వున్న లాన్ వేపు ఆత్రంగా చూడడం. ఈసారీ అతనలాగే చేశాడు. కాని-

ఆమె అక్కడ లేదు!

కొంచెం నిరాశ. ఎందుకో భయం.

అంతలోనే మళ్ళీ ధైర్యం.

కొంచెం సేపటిలో ఆమె వస్తుందేమో! రాకుండా ఎలా వుండగలదు?

ఏదయినా సరదాగా ప్రారంభంకావాలే కాని అలవాటుగా అభివృద్ధిచెంది వ్యసనంగా పరిణమించకుండా వుంటుందా? అది మానవ నైజం. ఆమె-కొద్ది వారాల నుంచి రావడంలేదు!

అదుగో! ఆమె... వొస్తోంది.

అతను ఎదురువెళ్ళాడు.

పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు.

ఆమెకూడా మంచి అమ్మాయిలా మందహాసంతో బదులు చెప్పింది.

ఆమెనుంచి ఆ చిన్న... ప్రతిచర్య- అతనికి చాలా వుత్సాహం కలిగించింది. అతను- యిన్నాళ్ళలా కాక కొంచెం అభివృద్ధి సాధించదలుచుకున్నాడు. జీవితంలో కొంచెమయినా రొమాన్స్ లేకపోతే ఏం బాగుంటుంది? రొమాన్స్. థ్రిల్ కొత్తగా కరువైన జీవితాన్నెలా జీవించడం?

"మనం యిన్నాళ్ళ నుంచీ ఒకరి కొకరు పరిచయం చేసుకోనేలేదు. కనీసం ఇప్పుడైనా ఆ పని చేద్దాం-ఏం?" నవ్వుతూ-

"నా పేరు అజిత్. ఓ ప్రైవేట్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ని. ఎ.సి. క్వార్టర్సు.....కారూ......వొకర్ లా

హంగులయితే చాలా తిన్నాయి. జీతం. అదే ఆదాయం. అది పదివేలకి తగదు" అన్నాడు హుందాగా.

"మిమ్మల్ని కలుసుకోవడం-చాలా సంతోషంగా వుంది. నా పేరు జిత..."

"చాలా చిత్రమయిన పేరు. వెరీ మోడర్న్. మీలాగే అందంగా, గమ్మత్తుగా...జితా! మీకూ మీ పేరుకీ నా చాలా అభినందనలు."

"నన్ను పూర్తిగా చెప్పనివ్వలేదు మీరు" నవ్వింది ఆమె.

"చెప్తారుగాని...మనం కూర్చుందాం ముందు. ఏమంటారు?"

"ఓకె" అందామె అతని వెనక నడుస్తూ.

ఇద్దరూ- నిర్జనంగా ఉన్న-లాన్‌లో కూర్చున్నారు.

"ఐస్‌క్రీమ్ కొనిచ్చేదా?"

"నో...థాంక్స్! చూడండి...నాకు చాలా నిరాడంబరమైన జీవితం ఇష్టం. కనీసం యిక్కడ వున్నంత సేపయినా ఐస్‌క్రీమ్‌లలాంటివి దగ్గరకు రాకుండా... సోడా మంచినీళ్ళు...అలాగ..."

"ఓహ్! ఇందుకే కాబోలు అంటారు ఒకే రకపు పక్షులు ఒకచోట చేరుతాయని పోనీ...మంచినీళ్ళు తాగుదామా?" అతనామెవేపు చూశాడు- "అహా! మీరు అలసిపోయినట్లూ దాహంగానూ కనిపిస్తున్నారని."

"మావారూ యిలాగే! కొంచెం అలనట చెందనివ్వరు. ఎప్పుడూ తాజాగా పూరేకులా వుండాలంటారు. ఆయనకంత ప్రేమ.

"అభినందనలు."

"సీత కష్టాలు సీతవి, అలానే సీతాకోకచిలుక కష్టాలూనూ."

"మీ కష్టాలూ సీతాకోకచిలుక కష్టాలలా అందంగా వుండివుంటాయనే నమ్మకం. చెప్పండి, సరదాగా వింటాను"

"ఎప్పుడూ ఎ.సి లోనూ, పాలెస్ లోనూ, నౌకర్లతోనూ గడపడం కూడా చాలా విసుగే. అలాగే ప్రేమ కూడాను. సమయమూ పరిమితీ మించితే ప్రేమ కూడా చేదెక్కిపోతుంది. ఇది స్వానుభవం కొద్దీ చెబుతున్నాను. వారికి నేనంటే పిచ్చిప్రేమ. ఒక్క క్షణం వదలరు నంటరిగా. నాకేమో అప్పుడప్పుడేనా ఆయనకి దూరంగా, కనీసం, కొన్ని గంటలేనా గడపాలని ఉంటుంది. ఇది ఆయనకెలా చెప్పగలను. ఆయనని చూస్తుంటే నాకు జాలివేస్తుంది. పాపం, నాకోసం ఎంత కష్టపడి అన్నీ అమర్చుతారని! అటువంటివారితో-మీరంటే నాకు విసుగేస్తుందని ముఖంమీద ఎలా చెప్పగలను నిర్దయగా?"

ఆమె నిట్టూర్చింది.

"ఎంత ఆశ్చర్యం!" గట్టిగా అన్నాడతను ఆమెకేసే చూస్తూ.

"ఏమిటి?"

"సరిగ్గా నా పరిస్థితే. అద్దంముందు

లాగ."

"అంటే?" అర్థంకానట్లు చూసిం దామె.

"అదే...క్షణికవైరాగ్యం... లేదా విసుగు. జీతా! నాది సరిగ్గా మీలాంటి పరిస్థితే! చెప్పానుగా, వేలల్లో ఆదాయం. బంగళా.....కారు....భార్య... అన్నీ ఉన్నాయి. కాని వాటితో యిట్టే విసుగొచ్చేస్తుంది. ఆ జీవితం నుంచి ఎక్కడి కేనా దూరంగా పారిపోవాలన్పిస్తుంటుంది తరచుగా. పాపం, శ్రీమతి. ఎంత వెర్రిగా ప్రేమిస్తుందని నన్ను! ఇంట్లో వున్నంతసేపూ నా చుట్టూనే తిరుగుతుంది. అటువంటి అమిత ముఖంమీద- మమత్వంటే విసుగేస్తుందని ఎలాచెప్పేది? పాపం...నాకు యిద్దరు మంచిపిల్లల్ని కూడా ప్రసాదించింది నా శ్రీమతి."

"నయమే! మా శ్రీవారేం చేశారో తెలుసా?"

"ఏం చేశారు?"

"సామంత్ నిజంగా చాలా భావుకుడు నేనంటే ఎంత ప్రేమయితే మాత్రం- నేను ప్రసవవేదనకి లోను కాకూడదనీ, పిల్లలుపుట్టినా స్వేచ్ఛా సౌందర్యాలకు భంగం కలగకూడదనీ..."

"ఏంచేశారు?" ఆత్రంగా చూశాడు అజిత్.

"పెళ్ళికి ముందే వాసెక్టమీ చేయించేసుకున్నారు!"

"ఆ..."

"అంతే...ఆ కోవకి చెందినవారంతా అంతే. నాకు పిల్లలంటే యిష్టమని ఎప్పుడో ఎవరితోనో ఏ సందర్భంలోనో అంటే...ఆ మాట పట్టుకుని వివాహమైన మూడేళ్ళు తిరగకుండా ఓ బాబుని ఓ పాపని కని అందించేసింది. అవ్ కోర్స్ రెండో డెలివరీ తరువాత ట్యూపిడ్స్ నాట్స్ వేయించుకుందనుకోండి. అది వేరే విషయం. ఒకటి మాత్రం అనుభవం మీద చెప్పగలను నిశ్చితంగా."

"ఏమిటి?" కుతూహలంగా అడిగింది జీత.

"పెద్ద ఉద్యోగం...అధికారం... డబ్బు యివన్నీ యిచ్చే సుఖాలు కూడా విసుగు తెప్పించక మానవు. త్వరలో వాటినుంచి కూడా విముక్తి కోరుకుంటూంటాం..."

"చిత్రమేమిటంటే- మళ్ళీ అవి లేక పోయినా బతకలేం. ఉదాహరణకి నన్నే తీసుకోండి. శ్రీవారూ...ఆ ఇల్లూ నాలుగు రోజులయేసరికి విసుగెత్తుతుందా, పోనీ అని ఎక్కడికేనా వెళ్ళి ఓ వారం ఉందామనుకుంటే మూడోరోజు నుంచే ఇంటి మీదకీ శ్రీవారిమీదకీ ధ్యాస మళ్ళుతుంది."

"మరే."

"పదండి. మంచినీళ్ళు తాగివొద్దాం."

ఎవరో కరుణామయులు ఆ పార్కులో ఓ కుండతో మంచినీళ్ళూ పక్కనే ఓ జర్మన్‌సిల్వర్ గ్లాసూ ఉంచారు. వాళ్ళ




ఇద్దరూ చేరి రెండుగ్లాసులకూ తక్కువ తాగలేదు.

"ఏ కూలర్ నీళ్ళూ యింత రుచిగా హాయిగా ఉండవేమో!" అన్నాడతను.

"నిజమే. ఫ్రిజ్‌లోవి డ్రింకులు తాగి తాగి అసహ్యమేసిన వాటికి ఈ కుండ లోవి నీళ్ళు ఎంత బాగున్నాయని!"

ఇద్దరూ లాన్‌వేపు నడవసాగారు.

హఠాత్తుగా అన్నాడతను "లతా!"

"ఊఁ."

"ఇలా నడుస్తుంటే ఎంత బాగుంది!"

"ఆ స్త్రమానూ అయితే కారు కూడా బోర్!"

"మరే. నాకయితే జీవితాంతమూ యిలా మీతో నడుస్తూ కబుర్లు చెప్పు కుంటూంటే చాలనిపిస్తూంది."

ఆమె నవ్వింది. "నాకూను. కాని మనని మీ శ్రీమతి చూస్తే..."

"చూడదు" హామీ ఇస్తున్నట్లే అన్నా డతను.

"పోనీ–మీ కంపెనీవాళ్ళు చూస్తే"

"డామ్ ద డర్టీ కంపెనీ అండ్ లాట్ అర్థమయింది శీలా! మీ భయం– మా శ్రీమతి చూస్తుందని కాదు, మీ శ్రీవారు చూస్తారని కదూ!"

"కాదు" ఒక్కసారి ఆమె ముఖం మారిపోయింది. "ఎందుకంటే"

అతనికి భయం వేసింది.

ఆమె ఏదో చెప్పబోయింది అతను చెప్పనివ్వకుండా ఆమె మాటల కడ్డంపడి "ప్లీజ్ శీలా! నాకంతా తెలుసు. నీకూ అంతా తెలుసు. కాని...వొద్దు. మనం ఏమీ తెలియనట్లే ఇందాకటిలాగే–చూడు నవ్వేని నలుగురితోనూ పంచుకోవాలి. దుఃఖాన్ని ఒక్కరూ దాచుకోవాలి. నిజంగా యిది చక్కని జీవనసూత్రం. వారానికి కొన్ని నిమిషాలు–మహా అయితే ఒకగంట...కలలలో...పగటి కలలలో తేలినంత మాత్రాన మనసుకి ఆరోగ్యమే కాని సంభవించే నష్టమేమీ ఉండదనే నా విశ్వాసం" అన్నాడు

ఆమె కళ్ళల్లో నీళ్ళు

"ఏడుస్తున్నావా శీలా! దేనికి?"

ఆమె మౌనంగా వుండిపోయింది.

"చూడు! నువ్వు నా మాటలన్నీ నమ్మావని కాదు. నా ముఖం చూస్తూ నా వైఖరి గమనిస్తూ–ఎలా నమ్మగలవు? కాని నమ్మినట్లు నటించావ్. ఆ కాస్తసేపూ నేనెంత ఆనందం అనుభవించానని! కలలు కనడమే కాదు, కలలు చెప్పుకోడమూ మంచి అనుభూతే.

"అదితెలుసు కనుకనే నేనూ నీ పగటి కలలు చాలా శ్రద్ధగా విన్నాను. నమ్మినట్లు నటించాను. దీనివల్ల నీకు తక్కువ సంతోషం కలిగించననుకోను.

"కాని శీలా...!

మెడలో మంగళసూత్రమేనా లేని నీకు వివాహమైందని నేనెలా మోసపోతానని? అయినా నీకోసం మోసపోయినట్లు నటించాను...నీ తృప్తికోసం. క్షణికమే అయినా అమూల్యమైన ఆనందం నీ కందిద్దామని. అప్రియమైన సత్యం కంటె ప్రియమైన అసత్యమే మేలు కాదూ...?"

"కాని...కాని..."

"దయచేసి నా ప్రార్థన విను. శీలా! నేను నిరుద్యోగిని. నిరుద్యోగ వైతరిణిలో ఈదలేక ఈదలేక బాధచెందుతున్నవాడిని. నా సమస్యలూ కష్టాలూ నాకు లేవని కాదు ఈ పార్కుగేటు దాటి అవతల అడుగుపెట్టగానే అవి నన్ను చుట్టుముడతాయి. అంతమాత్రాన–

నాకు వుద్యోగం రాదని కాదు. నేడో రేపో...ఏదో ఓనాటికి నాకూ ఏదో ఓ వుద్యోగం రాకపోదు. కాని... అంత వరకూ బతికివుండడం ఎలా? శారీరకంగా కాదు...మానసికంగా మనిషిని మిగిలివుండటం ఎలా? అందుకూ ఈ చిన్న చిన్న పగటికలలూ, అందమైన నాటకాలూ, వారానికో గంట మనోకాశం

మీద విరిసే ఈ హరివిల్లులు తక్కువ విలువైనవనుకోను..."

ఆమె కతని మాటలు చాలా నిజమనిపించాయి.

ఇతనెవరో అచ్చంగా తనలాగే ఆలోచిస్తున్నాడే!

ఔను. ఇతని మాటలలోనూ ఎక్కువ నిజాలేవున్నాయి.

చాలా అందంగా లేకపోయినా

ఎక్కువ చదువుకోకపోయినా

ఉద్యోగిని కాకపోయినా

పేద యింటిలోని ఆడపిల్లయినా తనకీ—

ఏనాటికో వొకనాటికి పెళ్ళవుతుంది.

ఐ తీరుతుంది.

ముప్ఫయ్యేళ్ళవాడో, మూడో పెళ్ళివాడో, నచ్చువాడో పుచ్చువాడో ఎవడో వొకడు... ఓ మగాడు తననీ పెళ్ళిచేసుకుంటాడు.

కాని—

అంతవరకూ

ఆ శుభగడియ వరకూ

ఎలా వేచి వుండడం?

అతను చెప్పినట్లు—

జీవితంలో ఎప్పుడో వచ్చే మంచి రోజు వరకూ బతకడానికి, నిరీక్షించడానికి శక్తినీ ఉత్సాహాన్నీ ఇవ్వగలిగేవి యిలాటి పగటికలలూ చిన్నచిన్న అందమైన నాటకాలూ అవేనేమో! చేదునిజాలకంటే తియ్యని అబద్ధాలే ఒక్కొక్కప్పుడు మనుషులని బతికించి ఉంచగలవేమో!

"మీరు మళ్ళీ... వొస్తుంటారు కదూ జీతా?" అర్థిస్తున్నట్లే అడిగాడు. నిజమే. ఉద్యోగం వచ్చేవరకూ అతనీ పార్కుకి రావటమూ తప్పదు. కలలు కనకా తప్పదు. శ్రోత వుంటే పాటా, పాలు పంచుకునేవారుంటే నాటకాలలాటి పగటికలలూ ఎక్కువ రక్తి కడతాయి మరి.

రాక?

రాకుండా వుండలేను..., కనీసం పెళ్ళి అయ్యేవరకూ. యిక్కడికి వారానికొకమారయినా వొచ్చి... ప్రశాంతంగా... పగటికలలు కంటూ గడపకపోతే జీవితంలో నాకింక మిగిలేదేముంటుంది? అనుకుంటూ—

"తప్పకుండా వొస్తాను. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం ఐదుగంటలకి మీరూ వొస్తారు కదూ?" అందామె తన కావాలనన్నిటినీ లోపల దాచుకుంటూ.

"తప్పకుండా... థాంక్యూ... గుడ్ ఈవెనింగ్..."

ఇద్దరూ ఎవరిదారి వారు తీసుకున్నారు.

* * *